క్లుప్తంగా

కొనసాగుతున్న సదరం క్యాంప్



తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాల పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. శుక్రవారం కూడా క్యాంప్ జరుగుతుందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి చెప్పారు.

ఎండీయూ వాహనం సీజ్



తెనాలిరూరల్: తెనాలి నుంచి బాపట్ల జిల్లా చుండూరు మండలానికి రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు బస్తాలను లోడ్ చేస్తుండగా ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. తెనాలి పట్టణ చెంచుపేట డొంక రోడ్డులో ఓ డీలరు వద్ద ఎండీయూ వాహనంలో రేషన్ బియ్యాన్ని లోడ్ చేస్తున్నరన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు వెళ్లగా వాహనంలో 15 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. రెవిన్యూ అధికారులకు సమాచారమివ్వగా వారు వచ్చి పరిశీలించారు. ఎండీయూ వాహనం చుండూరు మండలానిదని, పక్క జిల్లా నుండి వాహనాన్ని ఎందుకు తెప్పించావని ఆపరేటర్‌ని ప్రశ్నించగా తన వాహనం మరమ్మతులకు గురవడంతో రేషన్ పంపిణీ కోసం చుండూరు నుంచి వాహనాన్ని తెప్పించినట్టు తెలిపాడు. బియ్యం బస్తాలు, వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. త్రీ టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో తక్కెళ్ళపాడుకు చెందిన సిబార్ దంత వైద్యశాల బృందం రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సువర్ణలత, ప్రోగ్రామ్ రిప్రజెంటెటివ్ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ కిరణ్, డాక్టర్ శ్రీలేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

డీఎల్‌పీవో వి.స్వరూప



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు తెనాలి సబ్‌కలెక్టర్, గుంటూరు కలెక్టరేట్‌లో గ్రామంలోని సమస్యలకు సంబంధించి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా గురువారం డీఎల్‌పీవో వి.స్వరూప పర్యటించి అర్జీదారుల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని బందుల దొడ్డి సర్వే చేయించాలని, రహదారిపై ప్లాస్టిక్ వ్యర్థాలు పడవేస్తున్నారని, అక్రమణలు తొలగింపు, పన్ను వసూలకు సంబంధించి ఫిర్యాదులు రాగా పరిశీలించి పరిష్కార దిశగా అధికారులకు సూచనలు చేసినట్లు వెల్లడించారు. ఆమె వెంట పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి కరిముల్లా, సిబ్బంది, అర్జీదారులు, గ్రామస్థులు ఉన్నారు.

వార్డుమెంబర్ పదవికి రాజీనామా

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు పంచాయతీ వార్డు సభ్యురాలు తన పదవికి రాజానామా చేశారు. పంచాయతీ పరిధిలోని ఖాజీపేట 14వ వార్డు (ఓసీ–మహిళా) మెంబర్‌గా పనిచేస్తున్న తిరుమలశెట్టి హేమలత తనవార్డులో అభివృద్ధి జరగలేదని, తమ సమస్యలపై ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించలేదన్న కారణంతో రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 4న తన రాజీనామాను తెనాలి మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పంచాయతీ కార్యదర్శికి సమర్పించినట్లు చెప్పారు. రాజీనామాను ఆమోదించినట్లు ఆమెకు సమాచారం ఇచ్చి తదుపరి చర్యలు నిమిత్తం బుధవారం జిల్లా పంచాయతీ అధికారికి లేఖ పంపినట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి గురువారం తెలిపారు.

సాహితీవనంలో నిప్పుకణిక కొమ్మిరెడ్డి

- ఎన్‌కౌంటర్‌లో బలైె పాతికేళ్లు
- నేడు గుంటూరులో 'జ్వాలాశిఖ విశ్వమోహన్' పుస్తకావిష్కరణ సందర్భంగా...



పిడుగురాళ్లలోని లెనిన్‌నగర్



విశ్వమోహనరెడ్డి భవన్



కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి

తెనాలి: కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి... ప్రజాఉద్యమనేత, శ్రామికవర్గ నవలా రచయిత. తన జీవితాన్ని, రచనా వ్యాసంగాన్నీ పీడితవర్గాల విముక్తి కోసం వినియోగించి, పాలకవర్గాలకు కంటగింపుగా తయారైన ఉద్యమకారుడు. ఆ వర్గం సృష్టించిన 'మానవహోమం'లో సమిధగా మారాడు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఆయన కన్నుమూసి పాతికేళ్లు. ప్రజాసంఘాల నిరసనను, ప్రజాస్వామిక హక్కులను 'అధికారం' నిరంకుశంగా అడ్డుకుంటున్న సందర్భంలో విశ్వమోహన రెడ్డి స్ఫురణకు వస్తారు. జనసాహితి ఆధ్వర్యంలో 11న సాయంత్రం గుంటూరులోని సీనియర్ సిటిజన్స్ సేవాకేంద్రంలో 'జ్వాలాశిఖ విశ్వమోహన్' పుస్తకావిష్కరణ సభ జరగనుంది.

కడప జిల్లా ప్రొద్దుటూరు సమీపంలోని పొట్టిపాడు విశ్వమోహనరెడ్డి స్వస్థలం. సంపన్న రైతు కుటుంబంలో 1949లో జన్మించారు. జడలు విప్పి కరాళ నృత్యం చేసిన ఫ్యాక్షన్ మారణ హోమంలో ఆప్తుల్ని, ఆస్తుల్నీ కోల్పోయాడు. పొట్టకూటి కోసం ఏదొక పనిచేయాల్సిన అగత్యం ఎదురైంది. జీవనం కోసం ఆయన చేయని పనిలేదంటే అతిశయోక్తి కాదు. రైతు ఇంట పాలేరుగా, రైతుకూలీగా, రిక్షా కార్మికుడిగా, ప్రింటింగ్ ప్రెస్ కార్మికుడిగా రకరకాల పనులు. ఆ క్రమంలోనే ఆ జీవితాల్లోని పీడననూ, దోపిడీని అవగతం చేసుకున్నాడు. తన బతుకు తాను బతుకుదాం అని సరిపెట్టుకోలేదు. తోటివారి జీవితాల్లో వెలుగులు నింపుదామని ఆలోచన చేశాడు. సంఘటిత శక్తిగానే అది సాధ్యమని నమ్మాడు. అందు కోసం కంకణం కట్టుకున్నాడు. నిద్రలేచింది మొదలు బండచాకిరీ మినహా మరేం తెలీని పాలేర్లకు సంఘం వచ్చింది. రిక్షా యూనియన్ ఆవిర్భవించింది. కార్మిక సంఘాలు ఏర్పాటయ్యాయి. అందుకు కారకుడు విశ్వమోహనరెడ్డి, తాను క్రియాశీలంగా ఉంటూ శ్రామికవర్గాల్లో చైతన్యం నింపాడు. దోపిడీకి వ్యతిరేకంగా హక్కుల కోసం గళం విప్పేలా చేసి, పోరుబాటన నడిపించాడు.

ప్రమాణ పత్రం రాసుకుని...

'పాఠకులను సోమరిపోతులను చేసే కవిత్వాలకంటే ఆచరణలో ఒక పాఠకున్నయినా నిలపడానికి వచ్చే యథార్థాలే రాయడం నా ఉద్దేశం. చివరివరకు ఇదే పద్ధతి అనుసరిస్తాననీ, ఎట్టి వాస్తవరహిత, అభూతకల్పనలు నేను రాయబోననీ, నా పాఠకులకు నేను తెల్పుకుంటున్నాను' అని ప్రమాణపత్రం రాసుకున్నారు. ఆ మాటకు అటూ ఇటూ బెసగకుండా వాస్తవిక సంఘటనలు ఆధారం చేసుకుని ఆయన చేసిన రచనలు సంచలనాన్నే సృష్టించాయి. 'జైలు' నవల టాల్‌స్టాయ్ నవల 'నవజీవనం' అంతటి ఉత్తమమైన నవలగా గుర్తింపును పొందింది. 'జైలు'తోపాటు మరో నవలలను శారద సాహిత్యవేదిక, తెనాలి వారు ప్రచురించారు. విశ్వమోహనరెడ్డిని జాక్‌లండన్, గోర్కీ , కుప్రిన్ వంటి రచయితలతో పోల్చినవారున్నారు. అచ్చులో వచ్చిన ఆయన తొలి నవల 'మానవహోమం'ను 'భోగిమంటలు' సినిమాగా తీశారు. సినీ అవకాశాలు వచ్చినా, జనం ముఖ్యమనుకుని ఆయన ఆ రంగంకేసి చూడలేదు. ప్రకాశం జిల్లా ఇంకొల్లు నుంచి 'గెరిల్లా' అనే పక్షపత్రికనూ నడిపారు.

ప్రజా ఉద్యమాల్లో మమేకమైన విశ్వమోహనరెడ్డి సమసమాజం కోసం కృషి చేశారు. ఉమ్మడి గుంటూరుజిల్లా పిడుగురాళ్లలో నివసించారు. అక్కడ భూమిలేని పేదలకోసం 70 ఎకరాల్లో 700 మంది పేదలకు ఇళ్ల నిర్మించటం విశ్వమోహనరెడ్డి ఉద్యమజీవితంలో గొప్ప మలుపు. లెనిన్‌నగర్‌గా నామకరణం చేశారు. అలాగే కొండమోడు అటవీ ప్రాంతంలో ఖనిజం తవ్విన 60 ఎకరాలను ఆక్రమించి 300 ఇళ్లను శ్రామికుల కోసం నిర్మించి, తరిమెల నాగిరెడ్డినగర్‌గా పేరుపెట్టారు. తన ఉద్యమాలతో పాలకులకు కంటగింపుగా తయారయ్యాడు. ఈ నేపథ్యంలో 2000 ఏప్రిల్ 11న భూమనపల్లె ఎన్‌కౌంటరులో విశ్వమోహనరెడ్డి, రైతుకూలీ ఉద్యమనాయకురాలు పగిడిపల్లి మరియమ్మ మృతి చెందారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా విదేశాల్లోని తెలుగువారి నుండి తీవ్ర నిరసన ఎదురైంది. సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర గవర్నర్‌కు అందజేయటం నిజంగా సాహితీలోకంలో చరిత్ర.



నిర్మించిన స్మారక స్థూపం

డిటెక్టివ్ పుస్తకాలతో సృజన

మరోవైపు నాలుగు డబ్బులు వస్తాయనే భావనతో జనంలో క్రేజ్ ఉన్న డిటెక్టివ్ పుస్తకాలతో ఆయనలోని సృజనకారుడు వెలుగుచూశాడు. హీరోయిజమ్‌ను ఎలివేట్ చేస్తూ సస్పెన్స్‌తో కూడిన ఆయన క్రైమ్ నవలల కోసం పాఠకులు ఆసక్తిగా ఎదురుచూశారు. కొమ్మిరెడ్డి పేరుతో రాసిన ఆ పుస్తకాల రచనను తర్వాతికాలంలో వదిలేశాడు. ప్రజలకు మేలుచేయలేని రచనలతో ప్రయోజనం లేదని భావించిన విశ్వమోహనరెడ్డి తాను చూసిన జీవితాలు, అధ్యయనం చేసిన సమాజాన్ని అక్షరబద్ధం చేయటం ఆరంభించాడు. ఎవరి స్వార్థం వారిదే, నరబలి, మాయాలోకం, దాడి, దొంగలు, జైలు, బొంగరం, క్షణికం, ప్రేమ, అశ్రుతర్పణం మానవహోమం, పల్లె, బలి, రిగ్గింగ వంటి 20 నవలల్ని రాశాడు. ఒక్కో రచనా ఒక్కో ప్రత్యేకం. ఆనాటి పల్లెలు, మనుషుల్లోని వివిధ రూపాలు, కఠోర జీవనసత్యాలను నిస్సంకోచంగా వెల్లడించాయి. చతుర మాసపత్రిక కొమ్మిరెడ్డి రాసిన 12 నవలల్ని ప్రచురించింది. కేవలం 48 గంటల్లో నవల రాయగలిగిన అలాంటి ప్రతిభావంతుడిని మరొకరని చూడలేదని ప్రముఖ సాహితీవేత్త చలసాని ప్రసాదరావు కీర్తించాడు.

14న తెనాలిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి

- పలువురికి విశిష్ట సేవా పురస్కారాలు ప్రదానం
- వివరాలు వెల్లడించిన ఐక్యవేదిక అధ్యక్షుడు కిరణ్



తెనాలిఅర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని తెనాలిలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్ కుమార్ పేర్కొన్నారు. రైల్వేస్టేషన రోడ్డులోని ఐక్యవేదిక కార్యాలయంలో గురు వారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో సేవలందించిన వారికి విశిష్ట సేవా పురస్కారం ఇవ్వనున్నట్లు తెలిపారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ముఖ్యఅతిథులుగా సబ్ కలెక్టర్ సంజనా సింహా, ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, ఎంఈవో–2 జయంతిబాబు, రైల్వే సూపరింటెండెంట్ రమణ, తదితరులు పాల్గొంటారని చెప్పారు. సీనియర్ పాత్రికేయులు బీఎల్.నారాయణ, ఏఎస్ఎన్ డీగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, ప్రముఖ శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు, జైభీమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె.దేవయ్య, ప్రముఖ వ్యాపారి మునగాల శ్యామ్ ప్రసాద్, గల్లా జ్ఞానశేఖర్, కనపర్తి రత్నాకర్, షేక్ ఫరీద్, ఎండీ సుబ్బయ్య, బండికళ్ళ సతీష, ఆరాధ్యుల కన్నా, థామస్, షేక్ సాధిక్, షేక్ సుభానీ, జెట్టి నాని, తదితరులు పురస్కారాలు ప్రధానం చేయనున్నట్లు చెప్పారు.

కఠెవరం ఫ్లెక్సీల తొలగింపులో ఉద్రిక్తత

అడ్డుకున్న దళిత సంఘాల నేతలు



ఎస్‌ఐ ఆనంద్‌తో దళిత సంఘాల నేతల వాగ్వాదం

తెనాలిటౌన్: గ్రామాల్లో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలను అనుమతించటం ప్రజలకు అసౌకర్యంగా ఉంటుందని అధికారులతో సహా ఎవరూ భావించటం లేదు. కనీసం ఆయా ఫ్లెక్సీలతో పంచాయతీలకు ప్రకటనల పన్నును వసూలు చేద్దామన్న భావన సంబంధిత ఉండటం లేదు. ఫలితంగా పట్టణాలతోపాటు గ్రామాల్లోని రహదారులు, కూడలి ప్రాంతాలు ఫ్లెక్సీలమయంగా తయారయ్యాయి. ఒక్కోసారి వాటి తొలగింపు కూడా సమస్యాత్మకంగా మారుతోంది. ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనేవరకు దారితీస్తుంది. ఇందుకు నిదర్శనం రూరల్ మండల గ్రామం కఠెవరంలోని రావిచెట్టు సెంటర్.

గ్రామంలోని ప్రధాన కూడలి ప్రాంతాన్ని రావిచెట్టు సెంటర్‌గా పిలుస్తారు. గ్రామంలో నివసించే వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల నేతలు/కార్యకర్తలు వివిధ సందర్భాల్లో జాతీయ నాయకులు, తమ అభిమాన నాయకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తుండటం పరిపాటి. ఏడాదిలో 365 రోజులు రకరకాల ఫ్లెక్సీలు కనిపిస్తుంటాయి. ఈ నేపథ్యంలో గురువారం రావిచెట్టు సెంటర్లోని భారీ ఫ్లెక్సీలను తొలగించేందుకు పంచాయతీ అధికారులు పూనుకున్నారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలతోపాటు అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ వంటి జాతీయ నేతల ఫ్లెక్సీలు ఉండటంతో పోలీసుల సహాయం తీసుకున్నారు. పోలీసుల సమక్షంలో ఫ్లెక్సీ బ్యానర్లను తొలగించే ప్రయత్నాలను పసిగట్టిన అంబేడ్కర్ యూత్, బాబు జగ్జీవన్‌రామ్ యూత్ నాయకులు అక్కడకు చేరుకున్నారు. జగజ్జీవనరామ్ జయంతి ఇటీవలే పూర్తయింది... అంబేడ్కర్ జయంతి ఈనెల 14న జరగనుంది. అలాంటప్పుడు ఆయా ఫ్లెక్సీల బ్యానర్లను ఎలా తొలగిస్తారంటూ ప్రశ్నించారు. 'జై భీమ్' అంటూ నినాదాలు చేశారు. ధర్నా చేస్తామని హెచ్చరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారేలా కనిపిస్తుండటంతో ఫ్లెక్సీలను తొలగించమని పోలీసులు హామీనిచ్చారు. అయినా జనం కదలకపోవటంతో పోలీసులే తిరిగి వెళ్లిపోయారు.

నేపథ్యమిదీ...

మాజీ ఎమ్మెల్యే వంగవీటి రంగా కాంస్య విగ్రహాన్ని రావిచెట్టు సెంటరులో ఏర్పాటుచేశారు. విగ్రహావిష్కరణ రకరకాల కారణాలతో రెండుసార్లు వాయిదా పడింది. చివరకు ఈనెల 13వ తేదీ సాయంత్రం ఆవిష్కరణకు ముహూర్తం నిర్ణయించారు. ఆహ్వాన పత్రికలు వేసి తెనాలి, వేమూరు, మంగళగిరి నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున జనసమీకరణకు విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విగ్రహం చుట్టుపక్కల ఫ్లెక్సీల తొలగింపు కోరుతూ అధికారులకు విన్నవించుకున్నారు. అందుకు పోలీసుల సాయంతో పూనుకోవటమే ఉద్రిక్తతకు కారణమైంది. ఫ్లెక్సీ బ్యానర్లను తొలగించటానికి ససేమిరా అంటున్నారు దళితసంఘాల నేతలు. అటు చూస్తేనేమో... రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రి పాల్గొననున్న ప్రోగ్రామ్ ఉంది. అధికారులు ఏం చేస్తారనేది ఇప్పుడు గ్రామస్తుల్లో చర్చనీయాంశంగా మారింది.

ఖాతాదారులకు సరళమైన రుణవిధానం బీఆర్‌ఈ

జీఎస్టీ ప్రాక్టీషనర్స్ సమావేశంలో స్టేట్‌బ్యాంక్ రీజినల్ మేనేజర్ వీవీ జగదీష్‌కుమార్



మాట్లాడుతున్న వీవీ జగదీష్‌కుమార్

తెనాలి: భారతీయ స్టేట్ బ్యాంక్ ఖాతాదారులకు బ్యాంకు రుణాలు సులభంగా అందించటానికి సరళమైన విధానాన్ని రూపొందించినదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వీవీ జగదీష్‌కుమార్ సూచించారు. స్టేట్ బ్యాంక్ రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో స్థానిక సుల్తానాబాద్‌లోని స్వర్ణ ఇన్ హోటల్‌లో గురువారం జీఎస్టీ ప్రాక్టీషనర్స్ (ఆడిటర్స్)తో సమా వేశం జరిగింది. సభకు ఆడిటర్ అమరా గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. బ్యాంక్ నూతనంగా ప్రారంభించిన బీఆర్‌ఈ (బిజినెస్ రూల్ ఇంజిన్) రుణాల విధివిధానాలను వీవీ జగదీష్‌కుమార్ వివరించారు. రుణాలు కావలసిన ఖాతాదారులు ఎస్‌బీఐ పోర్టల్‌లో స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకొని సత్వరమే రుణం పొందటానికి అవకాశం ఉందన్నారు. ఎస్ఎంఈ శాఖ చీఫ్ మేనేజర్ భరద్వాజ్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రూ.10 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు రుణం పొందవచ్చని తెలిపారు. ఆడిటర్లు అమరా గోపాలకృష్ణ, సూర్యనారాయణ, రవి శంకర్, నరేంద్రలు మాట్లాడుతూ, జీఎస్టీ సబ్మిట్ చేసే ప్రతి వ్యాపారి ఈ నూతన విధానాన్ని తెలుసుకుని తేలికగా రుణాలను పొందవచ్చని సూచించారు. చీఫ్ మేనేజర్ అజగర్‌అలీ, బ్యాంక్ అధికారి కర్ల శ్రీనివాసరావు, ప్రాంతీయ కార్యాలయ అధికారులు ప్రవీణ్, శ్రీనివాసరావు, మారీస్‌పేట శాఖాధికారి మల్లిఖార్జునరావు, వివిధ శాఖాధికార్ల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా ఆడిషన్లను మా–ఏపీ నిర్వహించదు

'మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా



రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను, లోగో విడుదల చేస్తున్న దిలీప్‌రాజా

తెనాలి: మా–ఏపీ ఆధ్వర్యంలో ఈనెల 16న తెనాలిలో సినిమా ఆడిషన్లు నిర్వహణపై వస్తున్న వార్తలకు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదని 'మా–ఏపీ' వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా స్పష్టంచేశారు. సంస్థ కార్యాలయంలో గురువార ం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన నటీనటుల కోసం మా–ఏపీ ఆడిషన్లు చేయదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2018 మా–ఏపీ రిజిస్టరైనట్టు చెప్పారు. అప్పటి ముఖ్యమంత్రి చేతులమీదుగా 'మా–ఏపీ' సంస్థ లోగోను లాంఛనంగా విడుదల చేశామన్నారు. 2018లో తమకు రిజిస్టరయిన టైటిల్ (మా–ఏపీ)వేరొకరికి ఏవిధంగా వర్తిస్తుందని ఆయన సంబంధిత అధికారులను ప్రశ్నించారు. తమ సంస్థ పేరుతో తెనాలిలో వేరెవరో ఈనెల 16 న ఆడిషన్లు పెడుతున్నట్టుగా జరుగుతున్న ప్రచారంపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఏప్రిల్ 16న తెనాలిలో సినిమా ఆడిషన్ల నిర్వహణకు మా–ఏపీకి ఎలాంటి సంబంధం లేదని దిలీప్‌రాజా చెప్పారు. ఇప్పుడే కాదు వేరెప్పుడూ కూడా తమ మా–ఏపీ సంస్థ ఆడిషన్లను నిర్వహించదని చెబుతూ ఔత్సాహిక నటీనటులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. వీరితో వర్ధమాన దర్శకుడు మణివరన్, నటుడు మిలటరీ ప్రసాద్ ఉన్నారు.

మార్కెట్లోకి తెనాలి డబుల్‌హార్స్ 'మిల్లెట్ మార్వెల్స్'

- తృణధాన్యాల ఉత్పత్తుల విభాగంలోకి తెనాలి డబుల్ హార్స్
- దశలవారీగా విదేశాలకు మిల్లెట్ మార్వెల్స్
- గ్రూప్ సీఎండీ మునగాల మోహన్‌శ్యామ్‌ప్రసాద్



'మిల్లెట్ మార్వెల్స్' విడుదలలో మోహన్‌శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ సంగీతరెడ్డి

తెనాలి: పప్పులు, ధాన్యాల విక్రయంలో ఉన్న తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ తాజాగా తృణ ధాన్యాల ఉత్పత్తుల విభాగంలోకి 'మిల్లెట్ మార్వెల్స్' పేరుతో ప్రవేశించింది. ఈ బ్రాండ్ కింద ధాన్యాలు, నూడుల్స్, కుకీస్, రెడీ టు కుక్ విభాగంలో 18 రకాల ఉత్పత్తులను ఆఫర్ చేయనుంది. అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జేఎండీ, మిల్లెట్ మార్వెల్స్ చైర్మన్ డాక్టర్ సంగీతరెడ్డి చేతుల మీదుగా వీటిని మార్కెట్లోకి విడుదల చేసినట్టు గురువారం తెలియజేశారు. హెల్త్ మిక్సెస్, డయాబెటిక్ ఫ్రెండ్లీ మిక్సెస్, సెమోలినా, పాస్తా, నట్స్ ఫ్రీజ్ డ్రైడ్ ఫ్రూట్స్, వెజిటబుల్స్ వంటివి దశలవారీగా మార్కెట్లోకి తేనున్నట్టు తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ సీఎండీ మునగాల మోహన్‌శ్యామ్‌ప్రసాద్ మీడియాకు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఆర్గానిక్ ఉత్పత్తులను సైతం విడుదల చేస్తామన్నారు. తొలుత తెలుగు రాష్ట్రాల్లో మిల్లెట్ మార్వెల్స్ ఉత్పత్తులను ప్రవేశపెడతామని, తర్వాత పాన్‌ఇండియా మార్కెట్‌కు విస్తరిస్తామని చెప్పారు. యూఎస్‌ఏ, కెనడా, న్యూజీలాండ్, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తామన్నారు. రాబోయే మూడేళ్లలో గ్రూప్ ఆదాయంలో 5 శాతం మిల్లెట్ మార్వెల్స్ ద్వారా సమకూరుతుందని భావిస్తున్నట్టు సీఎండీ చెప్పారు. 2024–25లో సంస్థ సేల్స్ టర్నోవర్ రూ.535 కోట్లు దాటిందనీ, మూడేళ్లలో నాలుగు అంకెల స్థాయికి టర్నోవర్‌ను చేర్చాలన్నది లక్ష్యంగా వివరించారు. 2005లో కంపెనీ ప్రస్థానం మొదలైందనీ, బ్రాండెడ్ కమాడిటీస్ రంగంలో మార్కెట్ లీడర్‌గా నిలిచామనీ, 12 దేశాల్లో అడుగుపెట్టామనీ, భారత్‌లో 15 రాష్ట్రాల్లోని కష్టమర్లకు చేరువయ్యామని తెలిపారు. తెనాలి డబుల్ హార్స్ ఉత్పత్తులు జనరల్ ట్రేడ్, మోడరన్ ట్రేడ్, ఈ–కామర్స్, క్విక్ కామర్స్ ద్వారా వినియోగదారులకు అందజేస్తున్నామని, బ్రాండెడ్ అవుట్‌లెట్ల ద్వారా కష్టమర్లకు మరింత అందుబాటులోకి రానున్నామని వివరించారు.

ఈ–అభ్యాస్ ఒలంపియాడ్‌లో 'శ్రీరామా'కు రాష్ట్ర ర్యాంకులు



చిలుమూరు(తెనాలి): చిలుమూరులోని శ్రీరామా సీబీఎస్‌ఈ హైస్కూలు విద్యార్థులు ఈ–అభ్యాస్ ఒలంపియాడ్‌లో రాష్ట్రస్థాయి అవార్డులను సాధించారు. మొదటి రెండు ర్యాంకులు పొందిన నలుగురు విద్యార్థులకు గుంటూరులో ఈనెల 13న జరగనున్న అవార్డు ప్రదానోత్సవానికి ఈ–అభ్యాస్ యాజమాన్యం ఆహ్వానించినట్టు ప్రిన్సిపాల్ ఉమా గురువారం తెలియజేశారు. 6వ తరగతిలో కె.సూర్యతేజ, 7వ తరగతి విద్యార్థి పి.శ్రీనివాసరెడ్డి, 8వ తరగతి విద్యార్థి కె.శ్రీజకు రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు రాగా, 9వ తరగతి విద్యార్థి బి.హర్షవర్ధన్‌కు రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు లభించిందని తెలిపారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 13న జరిగే బహుమతి ప్రదానోత్సవం పలువురు ఎమ్మెల్సీలు, శాస్త్రవేత్తలు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం నాయకులు సమక్షంలో జరుగుతుందని ఈ–అభ్యాస్ వ్యవస్థాపకుడు / కార్యనిర్వహణ అధికారి డాక్టర్ భువనగిరి ఫణిపవన్ తెలియజేసినట్టు ఉమా చెప్పారు.

పూలే జీవితంపై సినిమా అభినందనీయం

తెనాలి: చెలిమి విజన్ పతాకంపై డాక్టర్ పీఎం సుందరరావు దర్శకత్వంలో తీసిన 'మహాత్మ జోతిరావు పూలే' సినిమా గురువారం తెనాలిలోని పెమ్మసాని థియేటరులో విడుదలైన సందర్భంగా ఉదయం అధికారులు, అనధికారులు, మీడియాకు ప్రత్యేకంగా ప్రదర్శించారు. తెనాలికి చెందిన ఔత్సాహిక నటులు ఇరవైమంది ఈ సినిమాలో నటించటం విశేషం. ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మునిసిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, ఎంపీడీవో కార్యాలయ ఏవో ఆచంట శ్రీనివాసరావు, వివిధ రంగాల్లోని పట్టణ ప్రముఖులు, రంగస్థల కళాకారులు పెద్దసంఖ్యలో హాజరై తిలకించారు. తొలుత జోతిరావు పూలే చిత్రపటానికి అతిథులు పుష్పాంజలి ఘటించారు. సినిమా ప్రదర్శన అనంతరం కేసన శంకరరావు మాట్లాడుతూ లింగవివక్షకు, అణగారిన వర్గాల విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేసిన సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే జీవితం సినిమాగా రావటం సంతోషంగా ఉందన్నారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ సంఘ సంస్కర్తల చరిత్రను నేటితరానికి తెలియజేయటం అవసరమన్నారు. ముఖ్యపాత్రల్లో నటించిన పెద్దిటి యోహాను, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, బెల్లంకొండ వెంకట్, చార్లీ, అలపర్తి వెంకటేశ్వరరావు అతిథులు సత్కరించారు.

ఘనంగా మహావీర్ శోభాయాత్ర



మహావీరుడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న జైనులు



శోభాయాత్రలో పాల్గొన్న జైన మహిళలు

తెనాలిరూరల్: జైనులు దైవంగా ఆరాధించే మహావీర్‌స్వామి జయంతి సందర్భంగా తెనాలి పట్టణ జైన సంఘీయుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక శోభాయాత్ర నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో జైన తీర్థంకర్ మహావీర్ స్వామి చిత్రపటాలను పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. తెనాలి గంగానమ్మ పేటలోని జైన్ మందిరం నుంచి ప్రారంభమైన ఊరేగింపు నెహ్రూ రోడ్, గాంధీ చౌక్, బోస్ రోడ్డు, మెయిన్ రోడ్ల మీదుగా తిరిగి ఆలయ ప్రాంగణానికి చేరుకుంది.. ఈ సందర్భంగా జరిగిన శోభాయాత్రలో సంఘ పెద్దలు, చిన్నారులు, వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జైన్ మహావీరుని ఆధ్యాత్మిక గీతాలను ఆలపిస్తూ, గీతాలాపనలు, నత్య ప్రదర్శనలు చేశారు. జైన మత ఉద్దేశాన్ని తెలియజేశారు. నేమిచంద్ గోవానీ, రమేష్ చౌదరి, రమేష్ భన్సాలీ, అశోక్ చౌదరి, శాంతిలాల్ సంఘ్వీ, నరేష్ బగ్రేచా, బాబులాలి గాధియా తదితర పట్టణ జైన సంఘం సభ్యులు పర్యవేక్షించారు.

'ఆళ్ల'కు అంతర్జాతీయ మనస్సాక్షి దినోత్సవ అవార్డు

తెనాలి: ప్రముఖ రచయిత, కవి, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావుకు ఉగాండాలోని 'ఓయం డిజిటల్ అకాడమిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్'అంతర్జాతీయ మనస్సాక్షి దినోత్సవ అవార్డు లభించింది. ఇటీవల జరిగిన అంతర్జాతీయ మనస్సాక్షి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డును గురువారం ఆన్‌లైన్ వేదికగా అందజేశారు. విభిన్న నేపధ్యాలు, వృత్తుల నుంచి ఆధ్యాత్మిక వృద్ధి, స్వీయ అవగాహన, మనస్సాక్షి ఆధారిత చర్యలను ప్రోత్సహించే వ్యక్తులను గుర్తించి ప్రతి సంవత్సరం ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలియజేశారు. మనస్సాక్షి మార్గనిర్దేశం చేసిన నిర్ణయాలకు ఇతరులను వారి మనస్సాక్షిని అనుసరించి ప్రేరేపించేలా రచనలు చేస్తున్న కారణంగా ఆళ్లకు ఈ పురస్కారాన్ని అందజేశామని తెలిపారు.